## ఆటోడ్రైవర్ ఆత్మహత్య

ఎడపల్లి, ఆగస్టు 5: వివిధ కారణాలతో జీవితంపై విరక్తి చెందిన ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం బాపూనగర్‌లో చోటుచేసుకుంది. బాపూనగర్‌కు చెందిన రేపక కుమార్ (38)కు భార్య మౌనిక, పిల్లలు ఉన్నారు. కుమార్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. కొద్దిరోజులుగా ఆటోకు గిరాకీ లేకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. మరోవైపు ఆటో నడిపే విషయంలో సోమవారం ఇంట్లో గొడవ జరిగింది. దీంతో కుమార్ గదిలోకి వెళ్లి ఉరేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు.

## పెదవాగు మరమ్మతులకు 3.5 కోట్లు

- ఇరిగేషన్ అధికారుల అంచనా
- ప్రాజెక్టు పరిస్థితిపై జీఆర్ఎంబీ సమావేశం

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ) : ఖమ్మం జిల్లా అశ్వారావుపేటలోని పెదవాగు ప్రాజెక్టుకు తాత్కాలిక మరమ్మతుల కోసం దాదాపు రూ.3.5కోట్లు అవసరమవుతాయని ఇరిగేషన్ అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు ఏపీతోపాటు జీఆర్ఎంబీకి నివేదించారు. ప్రాజెక్టుపై తెలంగాణ, ఏపీ రాష్ట్రాలతో గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(జీఆర్ఎంబీ)చైర్మన్ ముకేశ్‌కుమార్ సిన్హా జలసౌధలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టుకు వాటిల్లిన నష్టం, పునరుద్ధరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు వాటిల్లిన నష్టాన్ని తెలంగాణ, ఏపీ అధికారులు జీఆర్ఎంబీకి వివరించారు. జీఆర్ఎంబీ చైర్మన్ మాట్లాడుతూ.. ప్రాజెక్టుకు భారీ వరద వచ్చిన నేపథ్యంలో హైడ్రాలజీ అధ్యయనం చేయించాలని, ప్రాజెక్టుకు శాశ్వత మరమ్మతుల కోసం ఇరు రాష్ట్రాలు అంచనాలు రూపొందించాలని, డ్యామ్ సేఫ్టీ సూచనలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. ప్రాజెక్టు కాల్వల పునరుద్ధరణ పనులను ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం చేసుకోవాలని స్పష్టం చేసినట్టు తెలిసింది. సమావేశంలో బోర్డు సెక్రటరీ(టెక్నికల్)కనోడియా, ఎస్ఈ ప్రసాద్, తెలంగాణ నుంచి ప్రాజెక్టు ఈఈ సురేశ్, ఏపీ ఏలూరు ఎస్ఈ దేవప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్ పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్ నుంచి బయటికిదూకుతున్న గోదారి జలాలు

# అన్నపూర్ణకు గోదావరి జలాలు

### హరీశ్‌రావు లేఖకు దిగొచ్చి నీటిని వదిలిన సర్కారు

రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 5: కాళేశ్వరం నుంచి గోదావరి జలాలను ప్రభుత్వం ఎట్టకేలకు అన్నపూర్ణ జలాశయానికి విడుదల చేసింది. మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖతో రాష్ట్ర సర్కారు స్పందించింది. సిద్దిపేట అన్నపూర్ణ, రంగనాయక, మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లను నింపి సాగునీరివ్వాలని శనివారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాయగా.. ఆదివారం సాగునీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా స్పందించారు. మిడ్‌మానేరు ద్వారా సిద్దిపేట జిల్లాలోని రిజర్వాయర్లకు నీటిని ఎత్తిపోస్తామని చెప్పినట్టుగానే సోమవారం నుంచి సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరిలోని అన్నపూర్ణ ప్రాజెక్టుకు ఎత్తిపోతలను ప్రారంభించారు. బోయినపల్లి మండలంలోని మధ్యమానేరు నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా తిప్పాపూర్‌లోని సర్జ్‌పూల్‌కు జలాలు చేరుతుండగా.. ఇక్కడి పంప్‌హౌస్‌లో రెండు బాహుబలి మోటర్లను ఆన్ చేశారు. ఒక్కో మోటర్ ద్వారా 3,220 క్యూసెక్కుల చొప్పున 6,440 క్యూసెక్కులు అన్నపూర్ణ జలాశయానికి తరలిస్తున్నట్టు ఏఈ సమరసేట తెలిపారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి నీటిని విడుదల చేయాలని కోరిన మూడు రోజులకే ప్రభుత్వం స్పందించడంతో రైతులు సంబురపడుతున్నారు.

# కన్నెపల్లిలో పంపింగ్ స్టార్ట్ చేయాలి

- కృష్ణా, గోదావరి నీళ్లు సముద్రం పాలు
- రాజకీయ కుట్రలో భాగమే ప్రాజెక్టుల ఖాళీ
- రైతాంగానికి నీరు ఇవ్వకపోతే పోరాటమే
- మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, గంగుల హెచ్చరిక



ఢిల్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): కన్నెపల్లిలో తక్షణమే పంపిగ్ ప్రారంభించి కాళేశ్వరం జలాలను రైతాంగానికి అందించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. వందల టీఎంసీల కృష్ణాగోదావరి జలాలు సముద్రం పాలవుతున్నా సర్కారు పట్టించుకోవటం లేదని నిప్పులు చెరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాల ద్వారా తమను సాధించాలనకుంటే నిరభ్యంతరంగా చేసుకోవచ్చని, అదే సమయంలో రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేస్తామంటే బీఆర్ఎస్ సహించదని తేల్చిచెప్పింది. ఢిల్లీలో సోమవారం మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని ఎండగట్టారు. రాష్ట్రంలో 8 నెలలుగా పరిపాలన పడకేసిందని విమర్శించారు. సాగునీటి రంగంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. గోదావరి, కృష్ణా నదుల నుంచి నీరు వందల టీఎంసీల నీరు వృథాగా సముద్రం పాలవుతున్నా రైతులకు నీరు ఇచ్చేందుకు కాంగ్రెస్ సర్కారుకు మనసు రావడం లేదని ధ్వజమెత్తారు. రాజకీయ కుట్రలో భాగంగా రైతులకు అందాల్సిన అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల్లో నీటిని ప్రభుత్వం దుర్మార్గంగా ఖాళీ చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు నీళ్లు ఉన్నాయనే సమాచారం తమకు ఉన్నదని, ఉన్న నీటిని సద్వినియోగం చేసుకునే సోయి కాంగ్రెస్ సర్కార్‌కు లేదని మండిపడ్డారు. మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో వర్షాభావం కారణంగా కరవు పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి అన్ని రిజర్వాయర్లు, చెరువులు నింపాలని డిమాండ్ చేశారు.

### భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి: కొత్త ప్రభాకర్‌రెడ్డి

రైతులను కేసీఆర్ కన్నబిడ్డలుగా కడుపులో పెట్టుకొని చూసుకుంటే కాంగ్రెస్ సర్కార్ రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రంగనాయక్‌సాగర్, అనంతసాగర్, కొండపోచమ్మ సాగర్ నింపి హల్దీ వాగు, కూడవెల్లివాగులో కేసీఆర్ గోదావరి నీటితో నింపి గజ్వేల్, నర్సాపూర్, దుబ్బాక, మెదక్ నియోజకవర్గాలోని రైతాంగానికి నీటి కష్టాలు లేకుండా చేశారని గుర్తుచేశారు.

### రైతుల నోట్లో మట్టి కొడుతున్న కాంగ్రెస్: గంగుల

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నోట్లో మట్టికొడుతున్నదని మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆరోపించారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధుల బృందం కాళేశ్వరం ప్రాజెక్టు పర్యటకు వెళ్లిన తరువాత నీటిని విడుదల చేసిందని ఆ తరువాత ఆపేసిందని మండిపడ్డారు. మిడ్‌మానేర్, ఎల్లంపల్లి, ఎల్ఎండీ ప్రాజెక్టులను కాంగ్రెస్ సర్కార్ కావాలనే ఎండబెట్టిందని ఆరోపించారు. ఇన్‌ఫ్లో ఉన్నా కన్నెపల్లి పంపింగ్ చేయడం లేదని పేర్కొన్నారు. ఎన్‌డీఎస్‌ఏ పేరు చెప్పి ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏకు ప్రస్తుత పరిస్థితిని వివరించిందా? ఒకవేళ ఉంటే ఎన్‌డీఎస్‌కు పంపిన నివేదికను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కన్నెపల్లి నుంచి లిఫ్ట్ చేయ డానికి సమస్య ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం భేషజాలకు పోకుండా నీటిని విడుదల చేయాలని హితవు పలికారు.

### అనర్హత వేటు పడేదాకా పోరాటం

బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై న్యాయకోవిదులు, రాజ్యాంగ నిపుణులతో చర్చించామని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని తెచ్చిన కాంగ్రెస్ పార్టీయే ఆ చట్టానికి తూట్లు పొడుస్తున్నదని మండిపడ్డారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికో విధానం అన్నట్టుగా వ్యవహరించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వైఖరిని ప్రజల్లో ఎండగడతామని హెచ్చరించారు. న్యాయస్థానాలపై తమకు నమ్మకం ఉన్నదని, హైకోర్టు తీర్పు కోసం వేచి చూస్తున్నామని పేర్కొన్నారు.

## కొడంగల్ -నారాయణపేట లిఫ్ట్‌కు టెండర్లు

- 9వ తేదీ నుంచి బిడ్ల స్వీకరణ

హైదరాబాద్, ఆగస్టు5 (నమస్తే తెలంగాణ): కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం (ఎన్‌కేఎల్‌ఐఎస్) పనుల కోసం టెండర్లను ఆహ్వానించేందుకు నీటిపారుదల శాఖ సిద్ధమైంది. రెండు ప్యాకేజీలుగా విభజించి పనులు చేపట్టాలని, ఈ నెల 9 నుంచి టెండర్లు స్వీకరించాలని నిర్ణయించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నారాయణపేట, కొడంగల్, మక్తల్ నియోజకవర్గాల్లో ని లక్ష ఎకరాలకు సాగునీటితోపాటు నారాయణపేట జిల్లాలో తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఎన్‌కేఎల్‌ఐఎస్‌ను ప్రభుత్వం ప్ర తిపాదించింది. దీనికోసం రూ.4,350 కోట్ల అంచనా వేసింది. ఈ మేరకు పథకం పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే శం కుస్థాపన చేయగా, ఇటీవల బడ్జెట్‌లో కూడా ప్రభుత్వం దాదాపు రూ.610 కోట్లను కేటాయించింది. పాంచ్‌దేవ్ బండ పంప్‌హౌస్ నుంచి బీమా పథకంలో భాగంగా నిర్మించిన భూత్పూర్ జలాశయానికి, అక్కడి నుంచి ఊట్కూరు చెరువుకు తరలించే పనులను ప్యాకేజీ 1 కింద చేపట్టనున్నారు. ఊట్కూరు చెరువు నుంచి జయమ్మ చెరువుకు, అక్కడి నుంచి కనుకుర్తి చెరువుకు నీటిని తరలించే పనులను ప్యాకేజీ 2 కింద చేపట్టనున్నారు. ఒక్కో ప్యాకేజీ పనులకు దాదాపు రూ.1,100 కోట్లు అవుతుందని అధికారులు అంచనా వేశారు.



నాగార్జునసాగర్ గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

## ఉప్పొంగుతున్న కృష్ణమ్మ

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): కర్ణాటక, మహారాష్ట్రలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ ఉప్పొంగి ప్రవహిస్తున్నది. జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు స్థిరంగా భారీ వరద ప్రవాహం కొనసాగుతున్నది. శ్రీశైలం ప్రాజెక్టుకు 3.90 లక్షల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతుండగా, దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 294 టీఎంసీలకు చేరుకున్నది. 16 గేట్లను ఎత్తి వరదను దిగువకు విడుదల చేస్తున్నారు. మరోవైపు గోదావరిలో ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు వరద స్వల్పంగా కొనసాగుతున్నది.

నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నుంచి సాగునీటి అవసరాలకు సంబంధించి ఇండెంట్‌ను ఇవ్వాలని ఇరు రాష్ట్రాలకు తాజాగా కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు లేఖ రాసింది. 12 టీఎంసీలు కావాలని బోర్డుకు ఏపీ ఇండెంట్ సమర్పించినట్టు సమాచారం.



### టీచర్ల కోసం పాఠశాలకు తాళం వేసి నిరసన

ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం కుర్వపల్లి కొత్తూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాఠశాలకు తాళం వేసి తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేపట్టారు. గతంలో పనిచేసిన ముగ్గురు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా.. ఐదు తరగతులకు ఒక్కరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారని, ఏజెన్సీ ప్రాంతంలోని పాఠశాలలపై చిన్నచూపు చూడకుండా వెంటనే ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేశారు.

- అశ్వాపురం

# ధర్నాలతో దద్దరిల్లిన తెలంగాణ

**సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్మిక, విద్యార్థి సంఘాల డిమాండ్ • రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వివిధ రంగాల కార్మికులు, విద్యార్థి సంఘాల నాయకులు రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ధర్నాలు నిర్వహించారు. ఆయా జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు తీసి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. వెంటనే సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ, ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. పింఛన్లు పెంచాలని, సాగు భూములకు పట్టాలివ్వాలని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరారు.



### • చేనేత సమస్యలు పరిష్కరించాలి

చేనేత సమస్యలను పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామ చేనేత సహకార సంఘం వద్ద చేనేత కార్మిక సంఘం నాయకులు ధర్నా చేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన త్రిఫ్ట్ పథకం నిలిపివేశారని, ముద్ర రుణాలు, మార్కెట్ సౌకర్యం కల్పించడం లేదని, బునకర్ యోజన పథకాన్ని తీసివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత నాయకులు మాచర్ల కృష్ణ, గంజి శ్రీనివాస్, జయశంకర్, మధు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

- చౌటుప్పల్ రూరల్

### • రేవంత్ ప్రభుత్వానికి మూల్యం తప్పదు: పీడీఎస్‌యూ



విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మంలోని కాల్వొడ్డు నుంచి ట్రాఫిక్ పోలీసుస్టేషన్ వరకు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం నాయకులు అదనపు కలెక్టర్ మధుసూదన్‌కు వినతిపత్రం అందించారు.

-ఖమ్మం ఎడ్యుకేషన్,

### • ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ఆందోళన



కేంద్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు, రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.12 వేల ఆర్థిక సాయం అదించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంవీఐ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. సంఘం బాధ్యులు జిల్లా ఉపేందర్, రాందాస్, సాగర్, నాగేశ్వరరావు, రమేశ్, నర్సయ్య, లక్ష్మణ్, బాలాజీ, రవి, సైదులు, సతీశ్, నరేశ్ పాల్గొన్నారు.

- రఘునాథపాలెం

### సాగు భూములకు పట్టాలివ్వాలివ్వాలని ఆందోళన

మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ సమీపంలోని సర్వే నం. 718లో సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు అందించాలని 30 మంది దళితులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. వ్యవసాయ వృత్తిదారుల, తెలంగాణ సర్వీస్ వర్కర్స్ యూనియన్లు మద్దతుగా నిలిచాయి. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెంకటయ్య, నాయకులు నాగన్న, జంబులయ్య, వెంకటేశ్వరమ్మ, స్వాతి, నర్సింహులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

- హన్వాడ



### • సూపర్‌వైజర్లు బూతులు తిడుతున్నారు!



సూపర్‌వైజర్లు తమను బూతులు తిడుతున్నారని సచివాలయ హౌజ్‌కీపింగ్ సిబ్బంది, స్వీపర్లు సోమవారం ఆందోళనకు దిగారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు వారికి సర్ది చెప్పేందుకు ప్రయత్నించారు. కొందరిని చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్(సీఎస్‌వో)దగ్గరికి తీసుకెళ్లి మాట్లాడించారు.

- సెక్రటేరియట్

### • పింఛన్లు పెంచాలని వామపక్షాల ధర్నా



కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు జీవనభృతి రూ.4 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని తహసీల్ కార్యాలయాల ఎదుట ఐఎఫ్‌టీయూ, సీపీఎం ఎంఎల్ (మాస్ లైన్) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, నూతన రేషన్ కార్డులు ఇవ్వాలని, స్థలమున్న వారికి ఇల్లు కట్టుకోవడానికి రూ.10 లక్షల రుణం ఇవ్వాలని కోరారు.

- డిచ్‌పల్లి

### • ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయండి



పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు సోమవారం శంషాబాద్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఎన్నికల హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు.

- శంషాబాద్ రూరల్

### • గృహజ్యోతితో ఉపాధి కోల్పోయాం.. ఆదుకోండి



గృహజ్యోతితో ఉపాధి కోల్పోయిన తమకు ఉపాధి కల్పించాలని బిల్ కలెక్టర్లు హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ధర్నాచౌక్‌లో నిరసనకు దిగారు.